గొప్పలకు పోయి నవ్వులపాలు

లేని గొప్పలకుపోయి నవ్వులపాలైనట్టు బడ్జెట్ ఉన్నది. ఇది అన్ని రంగాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. రేవంత్ పాలనలో లక్షా 50 వేల పింఛన్లు కోత పెట్టింది వాస్తవం కాదా? రూ.31 వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పి రూ.20 వేల కోట్లతో సరిపుచ్చారు. ఏటా రెవెన్యూ మిగులు ఉంటే రాష్ట్రం దివాలా తీసిందని ఎలా చెబుతారు? దళితులు, గిరిజనులు, బహుజనులు ఇలా అన్ని వర్గాల ప్రజలను మోసగించేలా బడ్జెట్ ఉన్నది. - జగదీశ్‌రెడ్డి, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే



గ్యారెంటీలు.. గాయబ్!

హామీలపై చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు • బడ్జెట్‌లో అరకొరగానే నిధుల కేటాయింపు

పాత వాటికి గోరంత.. కొత్తవాటికి సున్నా
ఏడాదిదాకా కొత్త లబ్ధిదారుల ఎంపిక లేనట్టే

- మిగిలిన రైతులకు రుణమాఫీ గోవిందా..
- మహిళలకు నెలకు రూ.2500 ఊసే లేదు
- వృద్ధులకు 4 వేల పింఛన్ ముచ్చటే లేదు
- ఇందిరమ్మ ఇండ్లకు 22,500 కోట్లు కావాల్సి ఉంటే ఈ బడ్జెట్‌లో పెట్టింది 12,571 కోట్లే!
- సన్నాల రైతులకు రేవంత్ సర్కారు సున్నం
- ధాన్యం బోనస్‌కు 5 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటే.. బడ్జెట్‌లో పెట్టింది 1800 కోట్లే!

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ) : అలవిగాని ఆరు గ్యారెంటీల గారడీతో రాష్ట్రంలో అధికారాన్ని చేజిక్కించుకున్న కాంగ్రెస్.. ఇప్పుడు వాటి అమలుపై చేతులెత్తేస్తున్నది. 'మేము ఇప్పుడే అధికారంలోకి వచ్చినం.. ఆర్థిక పరిస్థితి బాగాలేదు. ఆరు గ్యారెంటీల్లో అన్నీ అమలు చేయలేము' అంటూ బీద ఏడ్పులు ఏడ్చిన సర్కారు.. ఏడాది తర్వాత కూడా అదే బేల తనాన్ని ప్రదర్శిస్తున్నది. తాజా బడ్జెట్‌లో మొదలు పెట్టిన గ్యారెంటీలకు అరకొర నిధులు కేటాయించి.. మిగతా గ్యారెంటీలకు గుండు సున్నా ఇచ్చింది. ఒక్కో పథకానికి వేల కోట్లు కావాల్సి ఉంటే.. వందల కోట్లతోనే సరిపెట్టి చేతులు దులుపుకొన్నది. ఉన్న పథకాల్లో నిధుల కోతతో ఏడాది వరకు కొత్త లబ్ధిదారులకు అవకాశం లేనట్టేనని స్పష్టమవుతున్నది. ఆరు గ్యారెంటీల్లో మిగిలినవాటి అమలు దైవాదీనమేనన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ మొత్తం 15 హామీలిచ్చింది. వీటిలో ఒక్క ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప 4 హామీలు అరకొరగానే అమలవుతున్నాయి. ఇక 10 హామీలను ప్రభుత్వం అటకెక్కించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మహిళలకు రూ. 2500 ప్రస్తావనేది?

మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెల రూ.2500 చొప్పున ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. తొలి బడ్జెట్‌లోనూ ఈ హామీపై ఎలాంటి ప్రస్తావన చేయని సర్కారు.. తాజా బడ్జెట్‌లోనూ దీన్ని పక్కకు పెట్టేసింది. రాష్ట్రంలో 1.68 కోట్ల మంది మహిళలు ఉన్నారు. అంటే వీరికి ప్రతి నెలా ప్రభుత్వం రూ.4,200 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లెక్కన సర్కారు తీరుతో రాష్ట్ర మహిళలు ఇంత భారీ మొత్తాన్ని నష్టపోతున్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఈ హామీకి దాదాపుగా మంగళం పాడినట్టేనన్న ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొత్తవారికి రూ.500 గ్యాస్ లేనట్టే

మహాలక్ష్మి పథకంలో భాగంగానే రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తున్నది. ఈ పథకానికి నిరుడు బడ్జెట్‌లో రూ.723 కోట్లు కేటాయించిన సర్కారు.. తాజా బడ్జెట్‌లోనూ అంతే మొత్తం కేటాయించింది. ప్రస్తుతం ఈ పథకం కింద 42 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నట్టుగా రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

‘గృహజ్యోతి’కి రూ.338 కోట్లు కోత

200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు సంబంధించి కొత్తవారి ఇండ్లలో 'గృహజ్యోతి' వెలగడం కష్టమేనని స్పష్టమవుతున్నది. తాజా బడ్జెట్‌లో గృహజ్యోతి పథకం నిధులకు సర్కారు కోత పెట్టింది. నిరుడు రూ.2418 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, ఈబడ్జెట్‌లో దీన్ని రూ. 2080 కోట్లకు తగ్గించింది. గతంకంటే రూ.338 కోట్లు కోత విధించింది. ప్రస్తుతం 50 లక్షల మంది ఈ పథకం కింద లబ్ధిపొందుతుండగా బడ్జెట్‌లో కోత పెట్టడంతో వారి సంఖ్యలోనూ కోత పెడతారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రైతులకు 'భరోసా' దక్కేనా?

రైతుభరోసా కోసం ఈ బడ్జెట్‌లో రూ.18 వేల కోట్లు కేటాయించింది. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని నిరుడు బడ్జెట్‌లో పేర్కొన్న ప్రభుత్వం ఈసారి మాట తప్పి రూ.12 వేలకు కుదించింది. గత వానకాలం రైతుభరోసాను ఎగ్గొట్టగా తాజాగా యాసంగి భరోసా కూడా ఇప్పటి వరకు అందించలేదు. దీంతో బడ్జెట్‌లో కేటాయింపులే తప్ప.. రైతులకు భరోసా దక్కడం లేదన్న విమర్శలున్నాయి.

సన్న రైతులకు బోనస్ కష్టమే!

ఎన్నికల్లో ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామంటూ ప్రకటించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక కేవలం సన్నాలకే ఇస్తామంటూ మెలిక పెట్టింది. పోనీ ఆ సన్న ధాన్యానికైనా పూర్తిగా ఇస్తున్నదా? అంటే అదీ లేదు. రాష్ట్రంలో రెండు సీజన్లలో కలిపి సుమారు 80 నుంచి కోటి టన్నుల సన్నాలు ఉత్పత్తి అవుతాయి. ఈ లెక్కన బోనస్ కింద రూ.5 వేల కోట్లు కావాలి. కానీ కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌లో కేవలం రూ. 1800 కోట్లే పెట్టి మమ అనిపించింది. దీంతో సన్నధాన్యం బోనస్‌పై అనుమానాలున్నాయి.

ఇందిరమ్మ ఇండ్లకు ఈ నిధులు ఏ మూలకు?

ఇందిరమ్మ ఇండ్లపై కాంగ్రెస్ సర్కారు మాటలు, కేటాయింపులే తప్ప ఆచరణలో మూపడం లేదు. గత బడ్జెట్‌లో చెప్పిన అబద్ధాలనే మళ్లీ వల్లెవేసింది. గత బడ్జెట్‌లో నియోజకవర్గానికి 3500 చొప్పున 4.5 లక్షల ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. రూ.22,500 కోట్లు అవసరమని అంచనా వేసింది. సరిగ్గా ఈ బడ్జెట్‌లోనూ ఇదే హామీని రిపీట్ చేసింది. ఈ లెక్కన ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించాల్సింది రూ.45 వేల కోట్లు కాగా రూ.12,571 కోట్లే కేటాయించింది. ఈ నిధులు రూ.5 లక్షల చొప్పున కేవలం 2.51 లక్షల ఇండ్లకే సరిపోతాయి. మరి మిగిలిన 6.49 లక్షల ఇండ్ల సంగతే మిటనేది ప్రశ్నార్థకం! ఇక ఈ పథకంలో భాగమైన ఇంటిస్థలం లేని వారికి స్థలం కేటాయింపు, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం హామీలకు అతీగతీ లేదు.

గ్యారెంటీలు	అమలు తీరు
మహిళలకు ప్రతినెల రూ.2500	లేదు
రూ.500కే గ్యాస్ సిలిండర్	పాక్షికం
ఆర్టీసీలో ఉచిత ప్రయాణం	అమలు
రైతులకు రూ.15 వేలు (అమలు చేస్తున్నది రూ.12 వేలు)	ఈ సీజన్‌లోనే ప్రారంభం
రైతు కూలీలకు రూ.12 వేలు	లేదు
కౌలు రైతులకు రూ.15 వేలు	లేదు
ధాన్యానికి రూ.500 బోనస్	కేవలం సన్నాలకే పాక్షికంగా
200 యూనిట్ల ఉచిత విద్యుత్తు	పాక్షికం
ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు	లేదు
ఇంటి స్థలం లేనివారికి స్థలం	లేదు
ఉద్యమకారులకు 250 గజాల స్థలం	లేదు
5 లక్షల విద్యాభరోసా కార్డు	లేదు
మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్	లేదు
రూ.4 వేల పింఛన్	లేదు
10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ	అమలు

విద్యాభరోసా ఏది?

విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా కార్డు ఇస్తామన్న కాంగ్రెస్ హామీ.. గాలిమాటగానే మిగిలిపోతున్నది. రెండు బడ్జెట్లు ముగిసినా ఈ హామీపై సర్కారు ఒక్క మాట కూడా ఎత్తలేదు. ఓవైపు విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా మరోవైపు భరోసా కార్డు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదనే విమర్శలున్నాయి.

ఇంటర్నేషనల్ స్కూళ్లకు రూ.8700 కోట్లు కోత

నియోజకవర్గానికి ఒకటి చొప్పున యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించిన సర్కారు, నిధుల కేటాయింపులో భారీగా కోత పెట్టింది. 58 స్కూళ్ల నిర్మాణానికి రూ.11,600 కోట్లు మంజూరు చేసినట్టు చెప్పిన ప్రభుత్వం.. బడ్జెట్‌లో రూ. 2900 కోట్లే కేటాయించింది. అంటే రూ. 8700 కోట్లు కోత పెట్టింది. వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇస్తామంటూ ఊదర గొట్టిన కాంగ్రెస్, ఇప్పుడు వారికీ మొండిచెయ్యి చూపిస్తున్నది. 50 శాతం నిధులే ఇచ్చింది. దీంతో పింఛన్ పెంపు కలగానే మిగలనున్నది.

లోకం పోకడ



దారుణంగా మాట తప్పారు!

చెయ్యమంటూనే మరిన్ని అప్పులు!

ఈ సంవత్సరానికి ప్రతిపాదన రూ.69,639 కోట్లు

గత ఏడాది కంటే రూ7,527 కోట్లు అదనం

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ఈ బడ్జెట్‌లోనూ అప్పులే ముందుపడ్డాయి. ఇకపై తాము అప్పులు చేయదలుచుకోలేదని జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్‌లో జనం సాక్షిగా ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి 72 గంటలు గడవక ముందే మాట మార్చారు. రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 69,639 కోట్ల రుణ సేకరణ కోసం ప్రతిపాదించారు. ఇది గత ఏడాది కంటే దాదాపు రూ.7,527 కోట్లు ఎక్కువ. ఇవి ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలో చేసే అప్పులు మాత్రమే. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రతిపాదిత రుణాల్లో బహిరంగ మార్కెట్ ద్వారా రూ.64,539 కోట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.4,000 కోట్లు, ఇతర రుణాల రూపంలో రూ.1,000 కోట్లు సేకరించనున్నట్టు మంత్రి భట్టి తెలిపారు. ప్రతిపాదిత రుణాల్లో రూ.100 కోట్ల లెక్క తేడా వస్తున్నట్టు ఆర్థిక విశ్లేషకులు చెప్పున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.69,639 కోట్లుగా చూపగా.. బడ్జెట్ బ్రీఫ్ వ్యాల్యూమ్-6లో చూపిన గ్లాన్స్‌లో రూ.69,539 కోట్లు మాత్రమే లెక్కకు వస్తున్నట్టు పేర్కొన్నారు. ఈసారి తెచ్చే రూ.69.5 వేల కోట్ల రుణాల్లో రూ.34,816 కోట్లు గతంలో తీసుకున్న అప్పులకు గాను అసలు, వడ్డీల చెల్లింపులకే సరిపోతుందని స్పష్టం చేస్తున్నాయి. ఇవి పోగా మిగతా సొమ్మును ఈ సంవత్సరంలో వినియోగించుకుంటామని అధికార వర్గాలు చెప్పున్నాయి. భూముల తనఖా, కార్పొరేషన్లు, స్పెషల్ పర్పస్ వెహికిల్స్(ఎస్పీవీ) ద్వారా తీసుకునే అప్పులు అదనం. కానీ, అవి బడ్జెట్ లెక్కల్లోకి రావని ఆర్థిక శాఖ అధికారులు తెలిపారు. అసలు అప్పు ఎంతకు వెళ్తుందో చెప్పలేని పరిస్థితి. గత బడ్జెట్‌లో కేవలం రూ.62 కోట్ల అప్పు చేస్తామని పేర్కొన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. చివరికి అన్నీ కలిపి రూ.1.58 లక్షల కోట్ల రుణాలు తెచ్చిన విషయం తెలిసిందే. మరి ఈ ఏడాది లెక్క ఎక్కడికి తేలుతుందో!

సంవత్సరాల వారీగా రుణం (కోట్లలో)

2024-25 **62,112**
2025-26 **69,639**

పీఆర్సీకి బడ్జెట్‌లో పైసల్లేవ్

కొత్త పీఆర్సీకి రూపాయి విదల్చని సర్కారు

వేతన సవరణ కోసం ఉద్యోగుల ఎదురుచూపులు

పీఆర్సీ లేనట్టేనని సర్కార్ పరోక్ష సంకేతాలు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో రూ.3.04 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను తయారుచేసింది ఉద్యోగులే. బడ్జెట్ ప్రతులను ముద్రించింది, వాటిని అసెంబ్లీకి చేర్చింది ఉద్యోగులే. కానీ, రూ.3.04 లక్షల కోట్ల బడ్జెట్‌లో అదే ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన పీఆర్సీ ప్రస్తావనేలేదు. కొత్త బడ్జెట్‌లో వేతన సవరణ ప్రస్తావన లేకపోవడంతో ఉద్యోగులు నిరాశ చెందారు. వాస్తవానికి 1% ఫిట్‌మెంట్ ప్రకటిస్తే, నెలకు రూ.200 కోట్లు ఉద్యోగులకు అందుతాయి. ఉద్యోగులు 50% ఫిట్‌మెంట్ అడుగుతున్నారు. తక్కువలో తక్కువగా 25% ఫిట్‌మెంట్ ప్రకటించినా నెలకు రూ.5 వేల కోట్ల చొప్పున ఉద్యోగులకు వస్తాయి. బడ్జెట్‌లో పీఆర్సీ ప్రస్తావన లేకపోవడంతో వచ్చే ఆర్థిక సంవత్సరం వరకు వేచిచూడాల్సిందేనని ఉద్యోగులు నిట్టూరుస్తున్నారు. తెలంగాణ మొదటి పీఆర్సీ గడువు 2023 జూన్ 30తో ముగిసింది. 2023 జూలై 1 నుంచి రెండో పీఆర్సీని ఇవ్వాల్సి ఉన్నది. గత కేసీఆర్ సర్కారు 2023 అక్టోబర్‌లో పీఆర్సీ కమిటీని నియమించింది. ఈ కమిటీ ఉద్యోగ సంఘాల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. పలు ఉద్యోగ సంఘాల నేతలు 50% ఫిట్‌మెంట్ ప్రకటించాలని ప్రతిపాదనలు సమర్పించారు. పీఆర్సీ కమిటీ నివేదిక ఎప్పుడిచ్చినా జూలై 1 నుంచి ఫిట్‌మెంట్ అమల్లోకి వస్తుంది. సర్కారు తప్పించుకోవడానికి వీల్లేదు. మొదటి పీఆర్సీకి, తాజాగా ప్రకటించాల్సిన రెండో పీఆర్సీకి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం 5% మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించింది. ఈ ఐఆర్‌పై అతీ గతీ లేదు. ఇప్పటివరకు ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండగా, జూలై 1 వస్తే ఆరో డీఏ పెండింగ్‌లో పడనున్నది. ఉద్యోగులు డీఏల గురించి అడిగి, బండ్లకు దిగితే జీతాలే ఇవ్వలేని పరిస్థితి వస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల హెచ్చరించడం గమనార్హం. గత కేసీఆర్ సర్కారు మాత్రం ఉద్యోగుల వేతనాలను 73% పెంచింది.

అభివృద్ధికి నిధులెక్కడ?

మూలధన వ్యయం 36,504 కోట్లే

బడ్జెట్‌లో కేటాయించింది 12 శాతమే • కేసీఆర్ పదేండ్ల హయాంలో 4 లక్షల కోట్లు

నాడు క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ వృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానం

అభివృద్ధికి నిధులు తగ్గిస్తున్న సర్కారు



హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలో ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా ఆర్థికంగా బలపడాలంటే మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) ఎంతో ముఖ్యం. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ప్రాజెక్టులు, రహదారులు, భవనాల నిర్మాణం తదితర రూపాల్లో, వివిధ రంగాల్లో పెట్టుబడిగా పెట్టి, వాటిని ప్రత్యక్ష, పరోక్ష ఆదాయ మార్గాలుగా మార్చి.. తద్వారా సంపదను సృష్టించి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వినియోగించాల్సి ఉంటుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్లుగా బడ్జెట్‌లో తూతూ మంత్రంగా మూలధన వ్యయం నిధులను కేటాయిస్తున్నది. తద్వారా అభివృద్ధిపై శ్రద్ధ లేదనే సంకేతాలను ఇస్తున్నది. రిజర్వ్‌బాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గత ఏడాది విడుదల చేసిన గణాంకాల ప్రకారం, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మూలధన వ్యయం వృద్ధిలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. కానీ, రేవంత్ సర్కారు మాత్రం తిరోగమనం దిశగా సాగుతున్నదని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రభుత్వం మూలధన వ్యయం కింద రూ.36,504 కోట్లు కేటాయించింది. మొత్తం 3.04 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా అందులో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులు 12% లోపే. ఈ దఫా బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.2.26 లక్షల కోట్లుగా చూపించారు. దీనితో పోల్చినా మూలధన వ్యయం 16 శాతమే. ఈ నిధులతో రాష్ట్ర అభివృద్ధి, ఆస్తుల కల్పన ఎలా సాధ్యమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూలధన వ్యయాన్ని నామమాత్రంగా కేటాయిస్తూ.. రాష్ట్రాన్ని పదేండ్లలో వన్ ట్రిలియన్ ఎకానమీగా మారుస్తామంటూ గొప్పలు ప్రచారం చేసుకుంటున్నారని ఆర్థిక నిపుణులు విమర్శిస్తున్నారు.

రెండేండ్లుగా తగ్గుదల

కేసీఆర్ ప్రభుత్వం చివరగా 2023-24లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.37,524 కోట్లు కేటాయించింది. ఆ ఏడాది తొలి రెండు నెలల్లోనే అంటే ఏప్రిల్, మే నెలల్లోనే రూ.6,785 కోట్లు ఖర్చు చేసినట్టు కాగ్ నివేదిక వెల్లడించింది. తద్వారా కేటాయింపుల్లో 18% ఖర్చు చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూలధన వ్యయం కేటాయింపులను తగ్గిస్తూ వస్తున్నది. 2024-25 బడ్జెట్‌లో రూ.33,486 కోట్లు కేటాయించింది. దాదాపు రూ.4వేల కోట్లు తగ్గించింది. బుధవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ. 36,504 కోట్లుగా పేర్కొన్నది. అంటే కేసీఆర్ ప్రభు త్వ చివరి బడ్జెట్ కంటే రూ.వెయ్యి కోట్లు తక్కువే.

పదేండ్లలోనే రూ.4 లక్షల కోట్ల ఖర్చు

కేసీఆర్ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనపై దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా మూలధన వ్యయం పెంచింది. 2014-15లో రాష్ట్ర బడ్జెట్ పరిమాణం రూ.లక్ష కోట్లు మాత్రమే. సొంత పన్నుల రాబడి రూ.29,288 కోట్లు మాత్రమే. దీంతో మొదటి సంవత్సరం మూలధన వ్యయంగా రూ.11,583 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆ తర్వాత ఏటేటా మూలధన వ్యయాన్ని పెంచారు. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం మొదలైంది. ఇదే సమయంలో కరోనా విజృంభించి, ప్రపంచం మొత్తం ఆర్థికంగా కుదేలైంది. దేశంలోనూ ఆర్థిక వృద్ధి మందగించింది. అయినా, కేసీఆర్ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. మూలధన వ్యయం కింద ప్రాజెక్టులు కొనసాగించేందుకే మొగ్గు చూపింది. కరోనా కష్టపెట్టిన 2019-20లో రూ.34,051 కోట్లు, ఆ మరుసటి సంవత్సరం రూ.34,327 కోట్లు మూలధన వ్యయానికి కేటాయించారు. మొత్తంగా పదేండ్లలో రూ.4.04 లక్షల కోట్లను మూలధన వ్యయం కింద ఖర్చు చేసినట్టు నిరుడు ఆర్బీఐ విడుదల చేసిన నివేదిక స్పష్టంచేసింది. ఈ నిధులతో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, ఫ్లైఓవర్లు, విద్యుత్తు సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, భవనాల నిర్మాణం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు. ఫలితంగా వ్యవసాయం, అనుబంధ రంగాలు, పరిశ్రమలు తదితర అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమైంది. ఇది రాష్ట్ర ఆదాయాన్ని మెరుగుపరిచింది. ఫలితంగా తెలంగాణ ఏర్పడేనాటికి రూ.29వేల కోట్లుగా ఉన్న సొంత పన్నుల ఆదాయం పదేండ్లలో రూ.1.36 లక్షల కోట్లకు పెరిగింది. నాలుగు రెట్లకుపైగా వృద్ధి నమోదైంది.

కేసీఆర్ హయాంలో దేశంలోనే టాప్

అత్యధిక మూలధన వ్యయం కేటాయిస్తున్న రాష్ట్రాల్లో 2014-15లో తెలంగాణ 12వ స్థానంలో ఉండగా.. 2023-24 నాటికి ఐదో స్థానానికి పెరిగింది. మూలధన వ్యయం వృద్ధిరేటులో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నది. 2014-15తో పోల్చితే 2023-24 నాటికి రాష్ట్ర మూలధన వ్యయం 580% పెరిగింది. దేశంలోని మిగతా పెద్ద రాష్ట్రాల్లో ఇదే అత్యధికం. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండేండ్లుగా మూలధన వ్యయాన్ని గణనీయంగా తగ్గించింది. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.33,486 కోట్లు కొవిడ్‌తో ఆర్థిక వ్యవస్థ తలకిందులైన రోజులకంటే తక్కువ. దీనిని బట్టే ప్రభుత్వ తీరు అర్థమవుతున్నదని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

గత మూడేండ్లలో మూలధన వ్యయం ఇలా..

ఆర్థిక సంవత్సరం	మూలధన వ్యయం
2023-24 (కేసీఆర్ సర్కారు చివరి బడ్జెట్)	రూ.37,524 కోట్లు
2024-25 (రేవంత్ సర్కారు తొలి బడ్జెట్)	రూ.33,486 కోట్లు
2025-26 ((రేవంత్ సర్కారు రెండో బడ్జెట్)	రూ.36,504 కోట్లు



బడ్జెట్ ప్రతులతో కూడిన బ్యాగును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేస్తూ అభినందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల అయిలయ్య, రామకృష్ణారావు, నంబిప్‌కుమార్ సుల్తానియా

3.04 లక్షల కోట్లతో రాష్ట్ర బడ్జెట్

అసెంబ్లీలో ప్రతిపాదించిన డిప్యూటీ సీఎం భట్టి • మండలిలో ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో బుధవారం రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదించారు. 2025-26 సంవత్సరానికి రూ.3,04,965 కోట్లతో ఆయన బడ్జెట్ పద్దును ప్రవేశపెట్టారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా పేర్కొన్నారు. దాదాపు గంటన్నరుకుపైగా సాగిన బడ్జెట్ ప్రసంగంలో ఆయా రంగాలకు చేసిన కేటాయింపులను, ప్రభుత్వం అమలు చేయబోయే పథకాలను చదివి వినిపించారు. తమ అసంబద్ధ విధానాలతో ఎదురైన ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుతూ, తమ 15 నెలల ప్రభుత్వ హయాంలో అంతా బాగున్నట్టు చెప్పుకొచ్చారు. మరోవైపు అదే సమయంలో అసెంబ్లీ వ్యవహారాలు, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కూడా శాసనమండలిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన ప్రసంగంలో మహాత్మాగాంధీ, అంబేద్కర్, శ్రీశ్రీ కొటేషన్లను ప్రస్తావించారు.

పొంతనలేని వ్యాఖ్యలు, చర్యలు

'నిజంకూడా రోజూ ప్రచారంలో ఉండాలి, లేదంటే అబద్ధం నిజంగా మారి రాష్ట్రాన్ని, దేశాన్నే కాదు ప్రపంచాన్ని కూడా నాశనం చేస్తుంది' అని మంత్రి భట్టి పేర్కొన్నారు. కానీ తమ ప్రభుత్వం గత 15 నెలల్లో సంపూర్ణంగా అమలుచేసిన సంక్షేమ పథకాలకు సంబంధించిన నిజాలను ఒక్కటి కూడా చెప్పలేకపోయింది. 'ప్రభుత్వం చేసే ప్రతి చర్యను శంకిస్తూ, నిరాధారమైన విమర్శలు చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో, సొంత పత్రికల్లో అబద్ధపు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఇటువంటి కువిమర్శలను సమర్థంగా తిప్పికొడుతూ, వాస్తవాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయడం మా బాధ్యత. నిజం ప్రజలకు చెప్పకపోతే, స్వార్థపరులు చేసే అబద్ధాలే నిజాలుగా భ్రమించే ప్రమాదం ఉంది. అందుకే, ఎప్పటికప్పుడు సత్యాలను ప్రజలముందు ఉంచుతూ ముందుకు సాగుతున్నాం' అని మంత్రి పేర్కొన్నారు. కానీ రుణ మాఫీ జరగలేదని, రైతు భరోసా అందలేదని, సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయని ఓవైపు రైతులు నిరసన గళం వినిపిస్తుండగా, ఇతర ప్రభుత్వ పథకాలపై నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, ప్రభుత్వ ఉద్యోగులు ఏడాది కాలంగా అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు. 'భూమి అనేది ఒక స్థిరాస్తి మాత్రమే కాదు, అది ఒక భావోద్వేగం, భూమితో ఉన్న అనుబంధం కన్నతల్లితో, సొంత ఊరితో ఉన్న అనుబంధంతో సమానం. ఒక వ్యక్తి తన భూమిని కోల్పోయినప్పుడు తన అస్తిత్వాన్నే పోగొట్టుకున్నట్టు భావిస్తాడు' అని భట్టి పేర్కొన్నారు. ఓవైపు పేదలు, రైతుల భూములను బలవంతంగా లాక్కుంటున్న ప్రభుత్వం నిజంగానే వారి అస్తిత్వాన్ని కొల్లగొడుతున్నదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. భట్టి విక్రమార్క తన బడ్జెట్ ప్రసంగంలో తమ ప్రభుత్వం పలు పథకాలు అమలు కానివి కూడా అమలు చేసినట్టు పేర్కొనడం, కొన్ని ముఖ్యమైన పథకాలకు నిధులు అతి తక్కువగా కేటాయించడం పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన తెలిపారు.

పదేండ్లలో లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ

రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు మెగా మాస్టర్ ప్లాన్ 2050 రూపొందించామని తెలిపారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పదేండ్లలో ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కార్యాచరణ చేపడుతున్నామని చెప్పారు. చైనా ప్లస్ వన్ వ్యూహంతో రాష్ట్రాన్ని గ్లోబల్ తయారీ కేంద్రం